# వెన్నెల

## సింగరాజు రామచంద్రమూర్తి

''పదహారు, పది'' అన్నాడు సిగరెట్ వెలిగించుకుంటూ రమణ.

''ఏమిటి అవి, నీ పిల్లల వయసులా?'' అన్నాడు విసుగ్గా శ్రీనివాసరావు.

షోగ్గా పొగ వదులుతూ ''అలా మరిచి పోతున్నావనే నీకు పుస్తకం ఒకటిచ్చాను.'' అని నవ్వి ''పెళ్ళికానివాడికి నాకు పిల్లలేమిటి?'' అన్నాడు.

శ్రీనివాసరావు కూడా నవ్వి ''ముదురు బ్రహ్మచారివి-పెళ్ళే కావాలని రూలా ఏమిటి పిల్లలుండేందుకు'' అన్నాడు.

''అయ్యబాబోయ్ అంతంత పిల్లలా మరీనూ. నీ దగ్గర తీసుకున్న అగ్గిపుల్లలు, సిగిరెట్లు సంఖ్య అది-వరుసగా ఎడమ నుంచి కుడికి.''

''ఆషాఢభూతి అని ఒకడుండేవాడటలే! పుచ్చుకున్న అప్పులకి దిక్కులేదుగాని అగ్గిపుల్లలు పదహారట. సిగ్గుండాలి''

''సిగ్గా-ఎందుకు? మనదగ్గర లేదు కనుక, నీ దగ్గర మూలుగుతోంది కనుక కొంచెం ఆ లక్ష్మీదేవికి గాలి పోకే ఏర్పాటన్నమాట!''

''ఇంతకీ ఎప్పుడిస్తావో చెప్పవు?''

''ఇస్తామోయ్! ఒక పద్ధతిలో అందరికీ ఇచ్చుకుంటూ వస్తాము... విషయం నువ్వు తెచ్చావుకనుక ఇప్పుడొక థర్టీ-ముప్పయి కావాలి. అవి బుక్కు కూడా ఇవ్వు అందులో రాసేస్తాను''

''సైన ఇవ్వను. పాతది వసూలు కావాలి!''

ఫక్కున నవ్వుతూ రమణ ''నీకో ధర్మసూక్ష్మం చెబుతాను విను శ్రీనివాసరావు, నీతిచంద్రిక రాసెందెవరో గుర్తులేదుగాని, వారు బంగారం లాంటి మాట అన్నారు. ''సమార్జిత విత్తమునకు త్యాగమే రక్షణము'' అని. గీత కూడా కొద్దోగొప్పో త్యాగం, ధర్మం గురించి చెప్పే ఉంటుంది అయితే అప్పివ్వటం గురించి సైలెంటుగా ఉంది. ఎందువల్ల?''

''నువ్వే చెప్పి ఏడు.''

''నవ్వాడు రమణ'' ఇదొక్కటే కాదు. ఇంకా చాలా ముఖ్యమయిన విషయాలమీద సైలెంటుగా ఉంది గీత. ఉదాహరణకి భోజనం, నిద్ర, మంచినీళ్ళు తాగడం, ఊపిరి పీల్చుకోవడం వంటివి. ఎందువల్ల?''

''చెబితే చెప్పు. లేకపోతే పో. అవతల బోలెడు పనుంది-ఆఫీసనుకున్నావా...''

''మంచిమాటలకి ఆఫీసేమిటి, ఇల్లేమిటి?... ఎందువల్లనంటె అవన్నీ నువ్వు తప్పనిసరిగా చేస్తావు కనుక. స్పెసిఫిక్‌గా ఒక్క త్యాగం గురించే చెప్పారు పెద్దలు. తిరిగి రాని డబ్బు అది-అదే దానికి రక్షణట! గొప్పవాక్యం! ఇక అప్పు అనగా తిరిగి వచ్చేది. దీని గురించి వేరే చెప్పనేల?''

''అందరిపట్ల ఏమోగాని నీకు ఇస్తే మాత్రం ఇదీ త్యాగం కిందనే లెక్క! నన్ను విసిగించకు''

''ఇదిగో శ్రీనివాసూ, నువ్వు నర్రీలో ఉన్నావని నాకూ తెలుసు. ఈ జన్మలో నీకింతవరకు పిల్లలు లేరు. ఎందువల్ల?''

''డాక్టరు నడగాలి''.

''అక్కరలే. లోకజ్ఞానం ఉన్న ఎవరయినా చెబుతారు. ''పిల్లలు''అనగా ఎవరు?''

''ఏమిట్రా పిచ్చిగాని పట్టిందా, అవతలికి పో నాకూ పట్టించేట్టున్నావు.''

''పోను. డబ్బులివ్వకపోయినా జ్ఞానాన్నివ్వగలను. ఇవ్వగలిగింది ఇవ్వలేకపోతే పాపం! 'పిల్లలు'అనగా క్రితం జన్మలో మనకి ఋణపడిన వాళ్ళు. ఈ జన్మలో తీర్చుకుంటారు. నీకు పిల్లలు లేరు అంటే ఏమిటన్న మాట?''

కుర్చీలోంచి లేచిపోతూ ''నీకు రూపాయి కూడా ఇవ్వను గుర్తుంచుకో'' అన్నాడు శ్రీనివాసరావు.

''సైస మంచి రూపాయి వరకు వచ్చావు-అదే హృదయపరివర్తనం అంటే! థాంక్స్... పిల్లలు లేరు అంటే నువ్వు క్రితం జన్మలో కూడా ఎవరికీ అప్పు ఇవ్వలేదన్నమాట! మళ్ళీ అదే తప్పు ఈ జన్మలో చేయకు. థర్టీ ఇచ్చి బుక్కు తీయి జేబులోంచి, రాసి వెళ్ళిపోతాను'' అన్నాడు అతని వెంటే కాంటీను దాకా వెడుతూ.

'' 'బుక్' అంటావేమిటిరా శ్రీనూ, ఏరా రమణా ఏమిటి విషయం?'' అడిగాడు కుటుంబరావు.

'' ''అయితే ఇవ్వనంటావు'' అన్నాడు కుటుంబరావుదగ్గర ఆగిపోతూ రమణ.

''ఛస్తే! పాతది ఇవ్వవుగాని... అరగంటలో వస్తాను కుటుంబం'' అని మోపెడ్ స్టార్ట్ చేశాడు శ్రీనివాసరావు.

''ఏమిట్రా మీ ఇద్దరి గొడవ-కూర్చో కాఫీ ఇప్పిస్తాలే'' అన్నాడు కుటుంబరావు.

''అదికాదు గురూ, నాకేమో అర్జంటుగా ఓ ఫిఫ్టీ కావాలి... వేళకి నువ్వు కనబడక అనవసరంగా వాడిని అడిగా, టైంవేస్టు. ఇక ఇప్పుడు నాకు దిగులేమిటి, కొండంత నువ్వుండగా! ఇలా జేబులో చేయిపెట్టి తీసుకునే చొరవ ఉంది నీ దగ్గర నాకు'' అంటూనే అతని జేబులో చేయిపెట్టి తీశాడు. ఇన్లాండు కవరొకటి బయటకు వచ్చింది.

''అది మానిడ రాసిన లెటరులే'' అన్నాడు కుటుంబరావు యథాలాపంగా.

''చాలా ఆనందం అక్కయ్యగారు ఇంట్లో లేరన్న మాట! నీకు అంతా నిలనే! ఆవిడ మా మంచి మనిషి. నేనంటే చాలా ప్రేమ-తమ్ముడూ, తమ్ముడూ అంటూ''.

''అవును నీ గురించే రాసింది.''

''ఏమంటుంది.''రమణని ఇబ్బంది పెట్టకండి, పాపం ఎంతో అవసరం ఉంటేగాని అడగడు'' అనుంటుంది. గ్రేట్ వుమన్!''

''ఇంతకీ డబ్బు కావాలంటావు?''

''అవును గురూ, ఓ సిక్స్టీ!''

''ఇందాక ఇంకేదో అన్నట్టున్నావు. అంతె మారిందా?''

నవ్వాడు రమణ ''బ్రహ్మపుత్ర నదదలా నిమిష నిమిషానికి మారాలి. మార్పు జీవలక్షణము గదా!''

''సరేగాని, సర్వరు కాఫీ తెచ్చేదాకా ''అప్పు'' గురించి నాలుగుమాటలు చెప్పనిందాం''

''విన్నాక ఇస్తావా మరి?''

''చెప్పరా ముందు.''

''ఆల్‌రైట్... అందరూ ఇప్పుడు ఇళ్ళు కడుతున్నారు కదా, ఆ కట్టడంలో తాజాపద్ధతి ఏమిటి?''

''ఏమిటో నువ్వే చెప్పు, నన్ను విసిగించకు''

''పిల్లర్స్. ఆకాశ హర్మ్యాలు పిల్లర్స్ వేసి క్షణాలమీద కట్టేస్తున్నారు. అలాగా ప్రపంచం యావత్తు 'అప్పు' అనబడే పిల్లర్‌మీద నడిస్తోంది.

రియల్లీ! ఎందువల్ల?... నిను్కోకు, నీక్కాదా ప్రశ్న-నన్ను నేనేనన్నమాట.

మన బ్యాంకు చూడు. జనం అలా వచ్చి ఫిక్సెడ్ డిపాజిట్లు వేస్తున్నారు. ఎందువల్ల... సారీ సారీ, నాకే ఈ ప్రశ్న కూడా. ప్రజలకి అప్పు ఇవ్వమని! ''అప్పుచ్చుకునేవాళ్ళు మాకు నేరుగా దొరకలేదు, పాపం ఎక్కడ తిరుగుతున్నారో ఏమవుతున్నారో కనుక మీరయినా వాళ్ళని పట్టుకుని వాళ్ళక్కావలసిన అప్పు ఇవ్వండి'' అని. అటుచూడు మన కౌంటర్లకేసి. క్యూల్లో నిలబడి ఉన్నారు అప్పు ఇచ్చేందుకు. ఎన్ని కళకళలాడే ముఖాలు! ఇటు అప్పుచ్చుకునే వాళ్ళు. ఒక్కమాట-అప్పు ఇచ్చేవారు, పుచ్చుకునేవారు లేకపోతే మన బ్యాంకు గతేమిటి గో విందా! నీ ఉద్యోగం హరిహరీ, నాది రామరామ!

పేపరు తీయి. దృష్టిసారించు. పేజీలకి పేజీలు

అప్పుల ప్రకటనలు! పెద్ద పెద్ద కంపెనీలు-పెట్టుబడి పెట్టమంటూ-తాము తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాల కన్నమాట! అంటే ఏమిటి-అప్పే! వెయ్యికోట్ల పెట్టుబడిగలవి కూడా అప్పడుగుతున్నాయంటే... కేవలం ఆ 'కళ' నశించిపోవడం ఇష్టంలేకనా! డబ్బు ల్లేకనా? పిల్లి!

అది వదిలెయ్. మరొక పక్క "దిగులు పడకండి ఋణం కావాలా" అన్న ప్రకటనలు

ఇదీ వదిలెయ్. "ఇళ్ళు కావాలా? మొదటి వాయిదా కట్టి మీ ఇల్లు మీరు తీసుకొండి. టి.వి. కావాలా-ఇదీ అంతే! మీరు ఉండటమే మాకానందం. మీరు మాడటమే మాకానందం. అప్పుదేమిటి, ఉన్నప్పుడు ఇద్దురుకాని!

వదిలెయ్. దేశం దాటు. నాన్ రెసిడెంట్ ఇండియన్లు. వాళ్ళ డబ్బు మూలుగులు ఖండాంతరాలకి వినబడుతోంది. "ఎక్కడ పెట్టుబడి పెట్టమంటారు' అని అడుగుతున్నారు.

అమెరికా తీసుకో. ఆయుధాలకి అప్పు. విమానాలకి అప్పు. అభివృద్ధి కార్యక్రమాలకి అప్పు...!

ప్రపంచం యావత్తూ 'అప్పు' అనే సూర్యుడు చుట్టూ తిరుగుతోంది. విషయం వచ్చింది కనుక సూర్యుడినే తీసుకో. గొప్ప సోషలిష్టు! భూమిమీద సముద్రాలనుంచి, నదులు నగయిరాలనుంచి నీళ్ళు అప్పు తీసుకుని వర్షాకాలం రాంగనే తీర్చేస్తాడు. అదికూడా పక్షపాత బుద్ధి లేకుండా ఉన్నవారు లేనివారు అందరూ తడుస్తారు సమంగా. ఆయనే అప్పు తీసుకోకపోతే మన భూవాసుల గతి శివశివ!"అ ని నవ్వి "చాలా, ఇంకొంచెం మాట్లాడనా?" అనడిగాడు.

"ఎంత గురువుగారు?" అనడిగాడు అప్పుడే వచ్చిన పవన్.

"సెవెన్టి!" అన్నాడు కుటుంబరావు.

"అదేమిటి, అరగంటక్రితమే సెవెన్టి ఫర్ టు! ఇంకా అక్కడనే ఉన్నారా? ఎప్పటిదీ వార్త?"

"ఎప్పటిదోలే... లేటెస్ట్ స్కోరు కనుక్కుని ఇప్పుడే వచ్చి చెబుతాడు మన రమణ. అప్పటిదాకా వెళ్ళి అల కూర్చో!" అని అతను అడుగువేయగానే "వీడి బొంద. రికమండేషన్‌గాదు. ఎందులోనూ వీలులేక చివరికి స్పోర్ట్సుమన్‌గా సర్టిఫికెట్ పంపాయించి ఆ కోటాలో ఇరికించారు. అందుకని మాట్లాడితే స్కోరడుగుతాడు" అన్నాడు కుటుంబరావు.

"వినబడుతుంది" అన్నాడు రమణ హెచ్చరికగా.

"వాడి ముఖం ఆ జుట్టులోంచి వినబడదు, కనబడదు."

రమణ నవ్వుతూ "అదేమిటి గురూ నన్నని, నువ్వు బ్రహ్మపుత్రనదరదలా అంకెని పెంచావు? చాలా థాంక్స్. ఆ అన్నమాట నిలబెట్టుకుని ఎయిటీ ఇచ్చెయ్. మరి నేను ఊరువెళ్ళాలి" అన్నాడు.

"ఇచ్చేందుకు నాదగ్గరేముందిరా ఈ కవరు తప్ప! అందులో ఏం రాసిందో తెలుసా నానిడ" మీ శిష్యుడి కాలరుచ్చు, అతనివ్వవలసిన డబ్బు వసూలుచేసి నాకు పంపండి. లేదంటే కుదరదు" అని"

"వ్వాట్? నువ్వు నాకు ఇవ్వవా? బుక్కులో రాస్తాను



గురూ!''

''నీబొంద. జుట్టు లేకపోయినా నీకూ మాటలు వినబడిచావడం లేదు. ఇప్పుడు నీ అప్పు లెక్చరు ఆ పవన్ గాడి దగ్గర కొట్టు. మాటయాభయి అడుగు. ఫిఫ్టి నీకు హండ్రెడ్ నాకు. నీ బుక్కులో వసూలు వేసేస్తానులే''

''అన్యాయం గురూ. నిన్నే నమ్ముకున్నాను.''

''అందుకే తరుణోయం చూపాను గదా! అదుగో, పవన్ బయటికి పోతున్నాడు. షూట్.''

గభాలున లేచి పవన్ వెంట నడిచాడు రమణ ''హల్లో మిస్టర్ పవన్, అప్పుగురించి మీ అభిప్రాయం ఏమిటి?'' అన్నాడు పరిచయవాక్యంగా.

''అదా గురూగారూ, ఫైన్ ఎలిఫెంట్. చాలా మంచి ఏనుగు పిల్ల! ఐవజ్ దేర్''

అతను ఏం చెబుతున్నాడో అంతుపట్టలేదు రమణకి. ''అప్పు, ఐమీన్ డబ్బులు బదులు తీసుకోవడం'' అన్నాడు విడమరిచి.

అతను నవ్వాడు ''ఒష్ అదా, ఫైన్. తప్పకుండా! అబ్బ, ఏషియాడ్ 'అప్పు' అనుకున్నాను. అబ్బా, స్కోరు చెబుదురూ''

''ఇటురా పవన్. ఒక్క నిముషం. ఇందులో కూర్చుందాం. మనవాడిదేలే! ఆ కుర్చీలో కూర్చోండి. కుర్రవాడు కనుక మీకు చాలా ఇంటరెస్టింగ్ విషయాలే చెబుతాను. ముళ్ళపూడి వెంకటరమణ అన్ని కథలు రాసినా అప్పు గురించి రాశాకనే పాపులర్ అయ్యాడు. బాపు కూడా అప్పులమీద కార్టూన్లేసి!!

''అబ్బ ఎవరండి వాళ్ళు?''

వాళ్ళనే ఎరగరా-బాపు-సినిమాలు తీసిన డైరక్టర్!''

''అలా చెప్పండి. సినిమా బాపా-మరి కార్టూన్లంటారేమిటి... ఈ పాటికి రెండు వికెట్లయినా పడితే... అబ్బా!''

''పడతాయి. మరి నాకు ఒక్క టూహండ్రెడ్ సర్దితే! ఐమీన్ రెండు వందలు అప్పుగా ఇస్తే-రెండు వికెట్లు పడి తీరతాయి!''

వ్వాట్?

''రెండువందలు నాకు అప్పిస్తే...''

గొల్లున నవ్వాడు ''రెండు పదులు ఉంటే బార్లో కామెంటరీ వింటుండేవాడిని! అబ్బో, ఎంత టెన్షన్, జుట్టు పీక్కోవాలనిపిస్తోంది. అబ్బ స్కోరండి...''

రమణ లేచాడు. పవన్ కూడా కుర్చీలోంచి దిగుతూ ''అయ్యబాబోయ్, నిజంగానే జుట్టు పీకేసుకున్నానా? ఎంత జుట్టో ''అన్నాడు ఖంగారుగా.

''నీ బొంద. నీజుట్టు కాదది. ఇది మంగలి షాపు! నేను పోతున్నాను. నువ్వూ బయటికి పో, లేకపోతే పట్టుకుని గుండు చేసేస్తాడు. షాపాయన-''బోణీ కాలేదింతే'' అని''

సాయంత్రం దిగాలుపడి కూర్చుని ఉన్న రమణ దగ్గరకు ఆఫీసు ప్యూను వచ్చాడు ''మిమ్మల్ని అయ్యగారు రమ్మంటున్నారు'' అంటూ.

కాలరు సర్దుకుని, ముఖంమీదికి నవ్వు తెచ్చుకుని లోపలికెళ్ళాడు.

''హల్లో మిస్టర్ రమణా, కూర్చోండి. కూర్చున్నాక ఇది చూడండి'' అంటూ ఒక కాగితం అతని ముందు పెట్టాడు.

చూశాడు రమణ. ఆఫీసులోని అందరి పేర్లు, వాళ్ళకి తనివ్వవలసిన డబ్బు మొత్తాలు ఉన్నాయి అందులో!

''పద్దెనిమిది వందలట మొత్తం. అదీ కంప్లెయింట్ మీమీద.'' అన్నాడాయన నవ్వుతూ.

''అందరికీ బుక్కులు ఇచ్చాగా!''

''ఇవిగో మీ పుస్తకాలు కూడా. డబ్బులు తిరిగివ్వకుంటే ఇవేం చేసుకుంటారు వాళ్ళు. అవునూ, మీకు చిన్నప్పుడు స్కూల్లోనూ, కాలేజీలోనూ కూడా అప్పడగటం అలవాటా? అప్పుడూ వాళ్ళకిలా చిన్న చిన్న పుస్తకాలు ఇచ్చేవారా?'' నవ్వుతూ అడిగాడాయన.

''మీకెలా తెలుసు?''

''సింపుల్. చిన్ననాటి అలవాట్లు పెద్దయ్యాకా ఉంటాయి. సైకాలజీ అన్నమాట!

''సరే, మీకింత జీతం వస్తుంది, మీకు ''అలవాట్లు'' ఏమీ ఉన్నట్టు లేవు. మరి ఇలా అప్పులు!! మధ్యలోనే నవ్వేశాడాయన. రమణా నవ్వేశాడు.

''సరదా సార్. పైగా ఊరు వెళ్ళడం మాత్రం నిజమే ఇవాళ... అలా అప్పు సంపాయించిన రోజున నా మాట్లాడే శక్తిమీద నాకు నమ్మకం కలుగుతుంటుంది. ఇంకా ఆ శక్తిపోలేదని!''

''మరి ఈ రోజు బోణీ కాలేదుకదూ, అందుకేనా డల్‌గా ఉన్నారు.''

''నిజం ఎవరూ ఇవ్వలేదు. డబ్బు కళ్ళచూడనిదే రూంకు వెళ్ళను. వీళ్ళంతా నిజంగా డబ్బులేని వాళ్ళనుకుంటున్నారు! చూద్దురు'' అని నవ్వి ''మీరు సహకరిస్తే చూపిస్తా'' అన్నాడు.

ఆయన నవ్వుతూ ''నాకే వేస్తున్నారా ఈ సారి?'' అన్నాడు.

''లేదుసార్. ఒక్క అరఘంట మీ డబ్బు నా చేతికివ్వండి చాలు.''

''ఇస్తే?''

''హమ్మయ్య. ఆ మాత్రం ఛాన్స్ ఇస్తే చాలు. ఒక్క ఫోర్ హండ్రడ్ ఇవ్వండి. అరగంట కాంగానే మీ డబ్బు మీ జేబులో ఉంటుంది. మీక్కూడా పుస్తకం పెట్టెయ్యను లెండి.''

''చూద్దాం'' అంటూనే ఆయన నాలుగు వంద నోట్లు ఇచ్చాడు.

''థాంక్స్ సార్. మరి చూడండి నా తడాకా!''

''ఊరెళ్ళాలి అన్నాడు. సాయంత్రమా?''

''అవన్నార్''

''మరి బ్రీఫ్‌కేస్ వద్దూ, ఇదీ తీసుకొండి''

''నో, నో అక్కరలేదు... వెయిట్‌సార్. ఇవ్వండి. గుడ్ అయిడియా! ఒక కాగితంమీద రెండు మూడు ఇంగ్లీషు కాసెట్లు-మంచి పాపులర్‌వి-రాసివ్వండి'' అంటూనే ఆయన బ్రీఫ్‌కేస్ ఖాళీ చేసి తీసుకుని, ఆయన ఇచ్చిన నాలుగు వందనోట్లలో రెండు జేబులో పెట్టుకుని, ఆయనిచ్చిన కాగితం, మిగిలిన రెండు వందనోట్లు చేత్తో పుచ్చుకుని లేచినిలబడ్డాడు.


''వస్తాను సార్. మరి చూడండి తమాషా'' అంటూ ఆయన గది తలుపుతీసి, ఒక కాలు గదిలో, ఒక కాలు బయటా ఉండేలా నిలబడి, గదివైపే తలపెట్టి పెద్దగా'' వస్తాను సార్. ''ఛార్లి'', ''నాటీ'' సెంట్లు- ఫ్రెంచివేగా... పెద్ద సీసాలు, చిన్నవి కొనరాదా సార్ అంత పెద్దవి... అలా కొంటే చవుకనా... అంత మంచివా? తెచ్చాక మీంకొక్కసారి రాస్తే నేనూ ఆనందిస్తాను. ప్లస్ ఈ కాసెట్లు... ఎక్కడా దొరకలేదా ఇవి. అంత బాగుంటాయా... సీయూ సార్'' అంటూ బయటికి వచ్చేశాడు.

అతని చేతిలో ఆఫీసరుగారి బ్రీఫ్‌కేసు, రెండు వంద నోట్లు చూసి అప్పన్నవారు మూగారు అతని చుట్టూ.

''నేను మద్రాసు వెడుతున్నాను. బాస్ సెంట్లు అవీ తెమ్మన్నారులే. గొప్పగా ఉంటాయట. ఇదుగో పవన్, ఈ క్యాసెట్లున్నాయా నీ దగ్గర?''

అతను ఆ చీటీ చూసి ''అబ్బో, అబ్బో, అప్పుడే ఈ ఊర్లు వచ్చి వస్తాయా ఇవి. గురువుగారూ, నాక్కూడా! అలాగే ఆ సెంట్లేవో బాస్ చెప్పలా అవి కూడా... ఎలా కొంటారు అవన్నీ'' అన్నాడు.

''నీకు మద్రాసులో మంచి ఫ్రెండున్నాడు. వాడికి ఆ హార్బర్‌పక్కన ఉన్న స్మగుల్డ్ మార్కెట్టు కరతలా



మలకం... సారి, నీకు తెలుగు రాదుగా-బాగా తెలుసును అన్నమాట!''

''రమణా మరి గొడుగు- ముడిచేసేది- ఒకటి కావా అయ్యా...''

''కాసెట్లు ఏమయినా పట్టుకు రాగలవా...సోనీ...''

నవ్వాడు రమణ. ''ఏదో సరదాకి ఉబ్బడిగితే లేద న్నారు అంతా! నా దగ్గర లేకనా? ఇదుగో రెండు వందలు'' అంటూ జేబులోంచి తీసి చూపించి ''సెటిల్ చేశాను. ఇప్పుడే నా అకవుంట్‌లోంచి రెండువేలు డ్రా చేయిస్తున్నాను. అయితే, మీకు పెట్టుబడి మాత్రం నేను పెట్టను. ఎవరి డబ్బా నాకు వద్దు. మీ మీ వస్తువులు, మీ మీ డబ్బు లిస్టురాసి ఇవ్వండి... తెచ్చిపెడ తాను. సరుకు నాణ్యత మాత్రం గ్యారెంటీ!''

సాయంత్రంకి తనకిచ్చేస్తానన్న డబ్బు తిరిగి రాక పోయేసరికి ఆఫీసరుగారు అందరితోపాటు తనకీ టోపీ వేశాడని గ్రహించాడు!...

చేతిలో బ్రీఫ్‌కేసు, జేబునిండా డబ్బు-మాంచి హుషారుగా ఉన్నాడు రమణ. తనసలు ఎక్కడకీ వెళ్ళ నవసరం లేదు. ఎటూ చేతిలోకి డబ్బు వచ్చిందని హైదరాబాదు బయలుదేరాడు-''ఫ్రెండ్స్‌తో ''హ్యాపీగా ఫోర్ డేస్'' '' అనుకుంటూనే గబుక్కున ఉలికి పడ్డాడు...

''ఎవరూ, జయ కదూ'' అనుకున్నాడు దూరంగా కనబడుతున్న మనిషిని చూసి.

''అవును. అక్షరాలా జయే!'' అతని గుండె ఝల్లు మంది-చదువుకునే రోజులనుంచీ దానికది అలవాటు. ఆ అమ్మాయి కనబడగానే! మనస్సుకీ అలవాటు-వశం తప్పి పోవడం! ''ఇదివరకటికన్న ఇంకా వేలరెట్లు అందం పెరిగింది. ఎన్నాళ్ళయింది చూసి'' గబగబ ఆమెవైపు, అడుగులేశాడు.

ఆమెకూడా ఇతనివంక చూసి ''హల్లో''అని నవ్వింది.

తనమీద వెన్నెల పడినట్లయింది అతనికి.

''జయలక్ష్మిగారూ, ఎంత అదృష్టం ఈ వేళ, ఎన్నాళ్ళకి!'' పరవశత్వంతో అన్నాడు.

''ముందు నా చేతిలోని ఈ సూట్‌కేస్ పట్టుకోండి, చేయి పీకేస్తోంది''

''ష్యూర్'' పట్టుకున్నాడు. కావాలంటే అది నెత్తిన కూడా పెట్టుకునేవాడే!

''చిల్లరుంటే ఇవ్వండి, రిక్షావాడు... అడుగో అతని కిద్దురూ పుణ్యముంటుంది. ఇచ్చివచ్చాక కొంచెం కాఫీ ఇప్పించరూ రమణా!''

''ష్యూర్'' అన్నాడు. అతనికి చేతులు, కాళ్ళు అన్నీ వశం తప్పినట్లయిపోయింది. లోకంలోని మనుష్యులంతా గమత్తుగా మాయమయిపోయి అంతటా జయ వ్యాపించి ఉంది!

కర్చీఫుతో ముఖం అద్దుకుంటూ ''మీరివ్వాళ దేముడిలా కనబడ్డారు నాకు'' అంది కొంచెం బాధతో. ''రమణగారు, చిన్ననాటి స్నేహాలు కల్మషం లేనివండి. పెద్దయినాక వచ్చే పరిచయాలు మన స్టేటస్, పొజిషన్ చూసేవే!''

''ష్యూర్'' అని తనని తనే విసుక్కున్నాడు రమణ. నాలిక అతుక్కుపోయినట్టు కదలడం మానేసి ఆ ఒక్క మాటే వదులుతున్నందుకు.

''టిఫిన్ తెప్పించండి. ఆ తరువాత కాఫీ. అన్నీ ఈ వేళ మీరే. ఆత్మీయుణ్ని చూస్తే ఎంత ఆనందమో ఇప్పుడే గ్రహించాను. 'సుఖం' అనేది చిన్నతనంలోనే పోయింది రమణగారు నాకు''

''మీరే? మీలాంటి వారి జోలికి కష్టాలు వచ్చేందుకే భయపడాలి. సుఖాలు, విరజాజులు, స్కూటర్లు మీ చుట్టూ తిరగాలి జయా.''

''నేను అదే అనుకున్నాను రమణగారు. కాని నా జీవితంలో చాలా మోసపోయాను. మీలాంటి వారిని కాదన్నందుకు మంచి శాస్తి'' అంది దిగులుగా.

అతని గుండె ఆగినట్లయింది. ''ఏమయింది ఎకు జయా, చెప్పండి- ఏం కావాలన్నా చేస్తాను'' అన్నాడు ఆవేశంగా.

''అందుకే మీరు కనబడగానే నాకు ప్రాణం లేచి వచ్చింది. చదువుకునే రోజులలో మనుషుల విలువలు తెలియవు రమణా, మీ కళ్ళల్లో నాపట్ల వుండే ఆరాధన నాకు తెలుసు. ఫాల్స్ వాల్యూస్‌కి ఇంపార్టెన్స్ ఇచ్చి.''

అతని కళ్ళు చెమర్చాయి.

''మా ఆయన లెక్చరరు. ప్రయివేట్లు అవీ-రెండు చేతులా సంపాదన అనుకుని ఆశపడ్డాను. నాలుగు చేతులతో ఖర్చు అని తరువాత గ్రహించాను. వారితోపాటు ఎమ్మెస్సీ చదివిన ఒకావిడ వీరికి నాకన్నా ముందు పరిచయం 'అన్నివిధాలా!' అంటే అర్థం అయిందను కుంటాను. పోనీ దాన్నే చేసుకునుంటే కాదన్నానా, అది పెళ్ళి చేసుకోదు. దానిమీద బోలెడు మంది ఆధార పడ్డారు. ఈయన దాన్ని వదలరు. అది ఈయన్ని వదలదు.'' గొంతు రుద్ధమయింది జయలక్ష్మికి.

''అయామ్ సారి'' అన్నాడు రమణ. తనూ అదే స్థితిలో ఉన్నాడు ''తను ఆరాధించే జయకా ఈ కష్టం'' అని.

''ఈవేళ అర్జంటుగా మా బ్రదర్ ఉంటే ఇక్కడికి వచ్చాను. మా ఆయనకి ఊరంతా అప్పులు. అంతా దానికిచ్చేస్తాడు. ఎంత సానుభూతి, దయా అదంటే! మైగాడ్!... నాకు మా డాడి చిన్నప్పుడు ఒక గొలుసు చేయించారు. దానికొక లాకెట్-అదంటే నాకు ఎంత ఇష్టమో! సెంటిమెంటల్ ఎటాచ్‌మెంటన్నమాట! అది లేకపోతే నేనూ ఇక ఉండనని!'' అని పేలవంగా నవ్వింది.

''ఏమయింది దానికి, చెప్పండి'' అన్నాడు ఆవేశంగా.

## మానవ నిధి

నిరంతర జాగురూకత కోరుతున్న వెల  
అసంఖ్యాకులైన సామాన్యుల ప్రాణాలలో  
ఈ దేశం ప్రజాస్వామ్యం విలువైతే—  
అంతులేని బాధల కోనల్లో  
ఎక్కడ తవ్వినా  
అనామకుల త్యాగాల గాథలు  
అవే చరిత్ర వెలకట్టలేని నిధులు!

నిఖిల్

''మా శ్రీవారు దానిని తాకట్టుపెట్టేసి ఆ డబ్బు ఆవిడకిచ్చేశారు. అన్నిటికీ భరించాను. ఇది నా సహ నానికి పరీక్ష అయింది. తనదగ్గర పైస లేదుట. బాంకు వాళ్ళు నిన్న వేలంవేసి వస్తువుల ప్రకటనలో దీన్ని కూడా చేర్చి...పేపరులో...'' మాట్లాడలేకపోయింది.

''చెప్పండి జయా, ఏం చేద్దామో...''

''మా బ్రదర్‌ని అడిగాను ఒక్క రెండువేలు ఇవ్వు, విడిపించుకుంటాను''అని ''మొన్ననేగా అమ్మా మీ ఆయనకి కొంపమీదికి వస్తే పదివేలిచ్చాను. ఇంకా ఏమివ్వగలను నేను మాత్రం''అన్నాడు. పాపం వాడూ బాధపడ్డాడు ''నువ్వేమీ అఘాయిత్యం చేయకు. నాదగ్గర ఉండు.''అంటాడు. అంతకన్న ఏంచేయగలడు?''

''ఎంతివ్వాలి? రెండువేలేనా'' అడిగాడు రమణ.

''వడ్డీతో సహా మరో రెండువందలవుతుంది'' అంది జయలక్ష్మి.

''దీనికి ఇంత బాధా! నాకు మీరు కనబడటం నా అదృష్టం. ఈ రకంగానయినా ఉపయోగపడ్డాను'' అంటూ జేబులోంచి గబగబ రెండువేల రెండువందలు ఇచ్చి ''ఇదిగో, ఈ వందకూడా ఉంచండి జయా! నో... థాంక్సులు అవి నేను వినలేను. నన్ను బాధపెట్ట కండి. మీరు ఏ బస్‌కివెళ్ళాలి?'' అడిగాడు.

ఆమె కళ్ళు అతనిపట్ల కృతజ్ఞతతో నిండిపోయాయి. ''సోమెనీ థాంక్స్! మళ్ళీ మీకు వేరుగా థాంక్స్ చెప్పు కుంటాను. ఇప్పుడు ముందు మా అన్నయ్యకి చెప్పాలి. పాపం వాడు వర్రీ అవుతుంటాడు. భర్తగారి దగ్గరకు రేపు వెడతాను. మరి వెళ్ళనా! మీరు మీ అడ్రసు ఇవ్వండి వస్తాను ఒకరోజు''

''పూలు పరవాలి ఆ రోజు''అని మనసులో నోట్ చేసుకున్నాడు రమణ.

అతనిచ్చిన కాగితం పుచ్చుకుని, డబ్బు సూట్ కేసులో దాచుకుని ''మీరు ఉండండి'' అంటూ వెళ్ళి పోయింది.

చుట్టూ చీకటి ఆవరించుకున్నట్లయింది రమణకి...

మర్నాడు ఆఫీసుకి వచ్చేసరికి ''ఆఫీసరుగారన్నట్లు నువ్వు వచ్చేశావే!'' అన్నారు ఒకరు.

''ఆయన అనడం ఏమిటి?''

''నువ్విచ్చిన డబ్బు అందిందిరా రమణా, థాంక్స్. మావిడకి పంపేస్తాను'' అన్నాడు సుబ్బారావు.

''డబ్బా?'' ఆశ్చర్యంగా అడిగాడు రమణ.

''నాకూ అందింది. నాకే కాదు అందరికీ పాత బాకీలు చెల్లిపోయాయి!''

''సార్ రమ్మంటున్నారు'' చెప్పాడు ప్యూను.

గదిలోకి వెళ్ళగానే ''థాంక్స్ రమణా, నిన్న ఆఫీ సులో ఇవ్వకపోయినా తరువాత మా ఆవిడద్వారా నాలుగు వందలూ పంపినందుకు'' అన్నాడు ఆయన.

''ఆవిడా!''

''జయలక్ష్మి నా భార్య. మీ అప్పుల గురించి సరదాగా చెబుతే, చెప్పింది తాను మీ క్లాసుమేటని! ఊరికే-గుర్తు పట్టలేదేమోనని-నా బ్రీఫ్‌కేసు ఇచ్చాను మీకు. టు మేక్ ష్యూర్!... సారి, మీ జోక్ మీ మీదనే వేశాను. బైదిబై మిమ్మల్ని ఒకసారి ఇంటికి రమ్మంది మీ సోదరి... మా జయ!''

*